క్లుప్తంగా

10న టెంకాయల వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 7 వరకూ మాఘమాసంలో జరిగే రంగనాథస్వామి తిరునాల సందర్భంగా ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి ఈ నెల 10న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ చైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, ఈఓ దేవదాసు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8 నుంచి 2024 పుష్యమాసం ఆఖరు వరకూ టెంకాయల విక్రయానికి మధ్యాహ్నం 12 గంటలకు వేలం పాట ఉంటుందని తెలిపారు. పాటలో పాల్గొనే వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించండి

యల్లనూరు: మండలంలోని యల్లనూరు, తిమ్మంపల్లి బ్యాంకుల్లో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని వైకేపీ ఏపీఎం ముత్యాలప్ప కోరారు. గురువారం డ్వాక్రా సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో తీసుకున్న రుణాన్ని త్వరగతిన పూర్తి చేయాలన్నారు. రుణాల చెల్లింపులు సక్రమంగా ఉంటే మరిన్ని రుణాలు ఇప్పిస్తామన్నారు.

పీరాకు ప్రముఖుల పరామర్శ


పీరాను పరామర్శిస్తున్న దృశ్యం

గుత్తి: ఇటీవలవ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హుస్సేన్ పీరా కర్నూలులో చికిత్స పొంది గురువారం ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కర్నూలుకు చెందిన ప్రముఖ వైద్యుడు బ్రహ్మారెడ్డి , వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చినబాబు, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ అమృత్‌రాజ్‌తో పాటు పలువురు పీరా ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ


దివ్యాంగులకు నిత్యావసరాలు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం 52 మంది పేద దివ్యాంగులకు రోటరీ క్లబ్ సభ్యులు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పేద దివ్యాంగుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రతి నెలా రూ.400 విలువజేసే నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు షాకీర్ తెలిపారు. కార్యదర్శి కిశోర్, సభ్యులు నాగేంద్ర, రామయ్య, మద్దిలేటి, బాబు, శ్రీనివాసులు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: మట్కా, పేకాట వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని పెద్దమల్లేపల్లి, నిట్టూరులో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మట్కా, పేకాట నిర్వహిస్తుంటే సమాచారం ఇవ్వాలని, అలాంటి వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు. యువత గొడవల జోలికి వెళ్లవద్దని సూచించారు.

బంగారు గొలుసు అపహరణ

తాడిపత్రి అర్బన్: మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ధరణీబాబు తెలిపిన వివరాల మేరకు..తూర్పుపాలెంకు చెందిన సులోచన తూర్పుపాలెంకు చెందిన సులోచన గురువారం సాయంత్రం కూరగాయల మార్కెట్‌కు వెళ్లి వస్తుండగా పెద్దమ్మ ఆలయం వద్ద హెల్మెట్ ధరించి బైక్‌పై వచ్చిన యువకుడు మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో పొందుతున్న కనగానపల్లి అంకే రామాంజనేయులు (32) గురువారం మృతి చెందాడు. కనగానపల్లి పోలీసులు తెలిపిన మేరకు మండల కేంద్రానికి చెందిన రామాంజనేయులు ఆదివారం రాత్రి మామిళ్లపల్లి నుంచి కనగానపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై, తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతన్ని అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించి ఆస్పత్రిలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య భూలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మారుతీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వైవీఆర్


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

గుంతకల్లు రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కసాపురంలో రెండవ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే ప్రజల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పార్టీల కతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేసిందని, అక్కడక్కడా ఇంకా ఏవైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే గడప గడపకూ తిరుగుతున్నామని తెలియజేశారు. గతంలో సంక్షేమ పథకాల కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, కానీ జగనన్న పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామంలోనే సమస్యలు పరిష్కరిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని తిరుగులేని మెజారిటీతో గెలిపించి జగన్‌పై అభిమానాన్ని చాటుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీడీఓ జాషువా, ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, వైస్ ఎంపీపీ ప్రభావతి, మార్కెట్ యార్డు చైర్మన్ నక్కా భీమలింగప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్‌రావు, సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, రాయల్ సుధాకర్, బెస్త మనోహర్, వినోద్ కుమార్‌రెడ్డి, గంతుల రామాంజనేయులు, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకూ'తో సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన గడప గడపకూ మన కార్యక్రమంతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జె.కొత్తపల్లిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించడంతోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటిముంగిటకే సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారన్నారు. మేలు జరిగితేనే ఆదరించమని చెప్పిన దమ్మున్న సీఎం జగనన్న అన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి నాయకులు తమస్వార్థం కోసమే అవసరైన సందర్భంలో చాగల్లు ప్రాజెక్టు నుంచి నీరువిడుదల చేసేవారని, వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 50 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో పెన్నానది నిత్యం గోదావరిలా ప్రవహిస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని గ్రామస్తులకు ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, ముచ్చుకోట అమరనాథరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, చిక్కేపల్లి రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు వేలూరు రాజశేఖర్ నాయుడు, సుధాకర్ నాయుడు అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గుత్తి రూరల్: ఉద్యోగ భద్రత కల్పించాలని యానిమేటర్లు కోరారు. గురువారం స్థానిక వైకేపీ కార్యాలయం వద్ద మండలంలోని యానిమేటర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యానిమేటర్ల సంఘం నాయకులు అశోక్ గౌడ్, ఫరూక్, మాట్లాడుతూ మండలంలో 15 సంఘాల కన్నా తక్కువ ఉన్న వారికి బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం మండల సమాఖ్య అధ్యక్షురాలు జయమ్మకు వినతిపత్రం అందజేశారు.

గార్లదిన్నె: యానిమేటర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని మండల యానిమేటర్స్ సంఘం సభ్యులు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ వీఓఏలుగా పని చేస్తున్న వారి కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏపీఎం శ్రీరాములు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి

గార్లదిన్నె: ఎస్సీ, ఎస్టీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు కోరారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సాగర్‌ను కలిసి ఎస్సీ, ఎస్టీల సమస్యలు వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు ఎస్సీ, ఎస్టీలు వివిధ సమస్యలపై వస్తే కాలయాపన చేకుండా పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ రవిరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప, బండారు కుళ్లాయప్ప, కల్లూరు ప్రసాద్, ఓబిలేసు, వెంకటేష్, పుల్లన్న పాల్గొన్నారు.

జగనన్నకు చల్లని దీవెనలు అందించండి

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


బాలికకు పింఛన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని


పింఛన్ సొమ్ము అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి, ఎంపీపీ మాధవి

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలోని వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు విరబూయించిన సంక్షేమ రథసారథి సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. గురువారం కౌన్సిల్‌హాల్‌లో 393 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము పెంచుతున్నామన్నారు. పింఛన్లను తొలగిస్తున్నారంటూ టీడీపీ, పచ్చమీడియా దుష్ప్రచారం చేసి అవ్వాతాతలను ఆందోళనకు గురి చేయడం సబబుకాదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని అడుగడుగునా అడ్డుకుంటున్న చంద్రబాబు, ఎల్లో మీడియాకు ప్రజలే బుద్దిచెప్పాలన్నారు. కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజనేయులు, మెప్మా టీపీఆర్ఓ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు నాగరత్నమ్మ, మెహరున్నీసా, కుమారి, రంగమ్మ, రవీంద్ర, సుమోబాషా, చాంద్‌బాషా, కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, వార్డు ఇన్‌చార్జ్‌లు మాచర్ల శివ, యూనస్, బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చాం

గుంతకల్లు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి పేర్కొన్నారు. మండలానికి నూతనంగా 239 మందికి మంజూరైన పింఛన్లను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బీవీ మాధవి, ఎంపీడీఓ జాషువాతో కలిసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పింఛన్ పొందాలంటే అన్ని అర్హతలు ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులకు లంచం ముట్ట చెబితే తప్ప సంక్షేమ పథకాలు అందేవి కావన్నారు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే నిద్రలో ఉన్న వారిని లేపి మరీ పింఛన్లను అందజేస్తున్నారన్నారు. కో ఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్లూరు రోడ్డులోని కేవీరెడ్డినగర్, మారుతీనగర్, అంబాభవాని వీధి, ప్రశాంతి నగర్ వీధుల్లో గురువారం సాయంత్రం కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి జన చైతన్య యాత్ర కార్యక్రమం జరిగింది. హర్ష ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వార్డు సెక్రటరీలను కోరారు. ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచెం రామమోహన్‌రెడ్డి, కౌన్సిలర్ ఆకుల చిన్ననాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్ డీవీకుమార్, నాయకులు వేణు, వేలూరు శ్రీనివాసులు, గణేష్, బాబా, లక్ష్మీ రంగయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పట్టణంలోని శ్రీనివాసపురం, కాల్వగడ్డ, సంజీవనగర్, సీపీఐ కాలనీకి చెందిన నలుగురు లబ్ధిదారులకు రూ 4. 67 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి గురువారం వారి ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోందని హర్షవర్ధనరెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేతోపాటు హర్షకు కృతజ్ఞతలు తెలియజేశారు.

డ్రోన్ సర్వేపై మున్సిపల్ అధికారుల కసరత్తు


వేణుగోపాల్ నగర్‌లో డ్రోన్ సర్వేలో భాగంగా జీపీ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ 2 సువర్ణ

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ అధికారులు డ్రోన్ సర్వేపై కసరత్తు ప్రారంభించారు. గతేడాది సెప్టెంబర్‌లో భూ హక్కుదారులకు శాశ్వత భూహక్కు పత్రాన్ని డేటాబేస్ డిజిటలైజ్‌డ్ రూపంలో ప్రభుత్వం అందించేందుకు రీసర్వేకు శ్రీకారం చుట్టింది. రీసర్వేలో భాగంగా ఎరోడైన్ ఏజెన్సీ బృందం ఓంకార్, విజయ్, దత్తా తదితరులు నగరపాలక సంస్థలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ2) సువర్ణను గురువారం కలిశారు. సర్వేలో బృందం సభ్యులు చేపట్టే సర్వేను అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఏసీపీ- 2 సువర్ణకు వేర్వేరుగా తెలియజేశారు. వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 35 గ్రౌండ్ కంట్రోలింగ్ పాయింట్ (జీపీ)లను తీసుకొని, తర్వాత డ్రోన్ ఫ్లై చేస్తామన్నారు. ట్రయల్ రన్‌లో భాగంగా ఆర్‌టీఏ కార్యాలయం, పాత ఆర్‌టీఏ కార్యాలయం, నగరపాలక సంస్థ, వేణుగోపాల్ నగర్ తదితర ప్రాంతాల్లో గ్రౌండ్ కంట్రోలింగ్ పాయింట్లను బృందం సభ్యులు పరిశీలించారు. శుక్రవారం నుంచి డ్రోన్ సర్వేకు చర్యలు తీసుకుంటారు. సర్వేయర్ ప్రభాకర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు అంజలి, మురళీ, పట్టణ ప్రణాళిక కార్యదర్శి పాల్గున, తదితరులు ఉన్నారు.

బొంబాయి రమేష్‌నాయుడుకు పరామర్శ


బొంబాయి రమేష్‌నాయుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడును బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు అనంతపురం సవీరా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య శుక్రవారం బొంబాయి రమేష్‌నాయుడును పరామర్శించారు. సవీరా ఆసుపత్రి ఎండీతో రమేష్‌నాయుడుకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రమేష్‌నాయుడు సతీమణి, యాడికి ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, కుమారుడు కృష్ణ కల్యాణ్‌బాబుతో మాట్లాడారు. బెంగళూరు లేదా ఎక్కడ వైద్యం చేయించినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, యాడికి సర్పంచు అనూరాధ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వార్డు మెంబర్ తిరుపతి, నాయకులు కోట చౌదరి, జేసీ నారాయణ రెడ్డి, బాలగంగయ్య, తలారీ నాగేష్ ఉన్నారు.

స్వామి సేవకులకు సత్కారం

తాడిపత్రి టౌన్: చింతల వెంకటరమణస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి రోజున భక్తులకు సేవలందించిన సేవకులకు ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, ఆలయ ఈఓ సుబ్రమణ్యం, ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. చింతల, బుగ్గ ఆలయ కమిటీ సభ్యులు సంజన్న, భూమా హరి, లక్ష్మీదేవి, మద్యాల లత, లక్ష్మీనారాయణమ్మ, రాఘవేంద్రారెడి ఉన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత


బాధితురాలికి నగదు అందజేస్తున్న కమిషనర్ జబ్బార్‌మియా, హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: అనారోగ్యంతో మృతి చెందిన మున్సిపల్ కార్మికుడు పోశయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం అందజేశారు. నాగులకట్ట వీధికి చెందిన మున్సిపల్ కార్మికుడు పోశయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా కింద శుక్రవారం రూ.లక్ష నగదును మృతుడి భార్య శాంతికుమారికి మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ జబ్బార్‌మియా, ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆస్పత్రుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని స్థానిక ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, ఎంపీపీ సునీత పేర్కొన్నారు. గురువారం ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి నిరంతరం వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. డాక్టర్లు, సిబ్బంది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. నాడు - నేడు కార్యక్రమం ద్వారా రూ.కోటితో కొర్రపాడు, బీకేఎస్ ఆస్పత్రుల రూపు రేఖలు మార్చేశారని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ తెహరున్నీసా, సభ్యులు మనేరి కొండమ్మ, పసులూరు సర్పంచ్ కల్పన, డాక్టర్ స్వాతి లక్ష్మి, సీహెచ్‌ఓ మోహన్‌రావు, ఏఓ శ్రీవాణి, ల్యాబ్ టెక్నీషయన్, పీహెచ్ఎన్ చెన్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ సునీత, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అనంత వెంకటరెడ్డి సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నాయకులు

బుక్కరాయసముద్రం: మాజీ ఎంపీ అనంత వెంకటరెడ్డి జిల్లాకు చేసిన సేవలు మరువలేనివి అని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం రోటరీపురంలో ఉన్న అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తన సోదరులు సుబ్బారెడ్డి, చంద్రారెడ్డితో కలిసి తండ్రి సమాధి వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు సాగు, తాగునీరు తీసుకరావడానికి అనంత వెంకటరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. అనంత వెంకటరెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, మహాలక్ష్మి శ్రీనివాస్, అనంతపురం మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, మాజీ మేయర్ రాగే పరుశురాం, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ బాషా, ఆలూరు రమణారెడ్డి, బీకేఎస్ సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, జయచంద్రారెడ్డి, పెన్నోబిలేసు, సత్యనారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, చామలూరు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టాలి

పెద్దవడుగూరు : మండలంలో ఉపాధి హామీ పనులను నాణ్యతగా చేపట్టాలని జిల్లా విజిలెన్స్(డ్వామా) అధికారి వై.బీ రమణారెడ్డి , ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12,13వ సామాజిక తనిఖీల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు తేల్చిన సొమ్మును త్వరగా రికవరీ చేయాలన్నారు. పని ప్రదేశాల్లో పనుల వివరాల బోర్డు ఏర్పాటు చేయడానికి వచ్చిన సొమ్మును జీజీఐ అకౌంట్‌కు బదిలీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఎంపిక

తాడిపత్రిటౌన్ : ఎమ్మార్పీఎస్ తాడిపత్రి, పెద్దపప్పూరు మండల నూతన కమిటీలను గురువారం ఎంపిక చేసినట్లు సమితి జాతీయ ఉపాధ్యక్షుడు చిన్నోళ్ల తిరుపాలు, జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి మండలాధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షుడిగా అనిల్, తాడిపత్రి పట్టణాధ్యక్షుడిగా కరుణాకర్, పెద్దపప్పూరు మండలాధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, కార్యదర్శిగా రాజశేఖర్‌తోపాటు కమిటీ సభ్యులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

బుక్కరాయసముద్రం: పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. గురువారం కొర్రపాడు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీకంపోస్టు తయారీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేస్తామన్నారు. అనంతరం కొర్రపాడు, రెడ్డిపల్లిలో డ్రైనేజీలను పరిశీలించారు. సచివాలయాలను తనిఖీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత రాధా మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లీలావతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


మాట్లాడుతున్న ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ మంజుల

గుత్తి: పట్టణంలోని ఏడీసీసీ బ్యాంకులో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ మంజుల ఆర్థిక విషయాలు, డిపాజిట్ల గురించి వివరించారు. బంగారు రుణాలకు సంబంధించి ఒక గ్రాముకు రూ.3,600 ఇస్తామన్నారు. వంట రుణాలు, ఎస్‌హెచ్‌జీ , జేఎల్‌జీ, పీఎం స్వానిధి, జగనన్న తోడు వంటి పథకాలకు రుణాలు మంజూరు చేస్తామని వివరించారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ వ్రతం

తాడిపత్రి టౌన్: స్థానిక గాజుల కృష్ణప్పవీధిలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం జరగనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. పుష్యమాసం పూర్ణిమ పురస్కరించుకుని వ్రతం నిర్వహిస్తామన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

పామిడి: పట్టణంలోని నెహ్రూనగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులను గురువారం ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ పరిశీలించారు. నాణ్యతతో పనులను చేపట్టాలని ఈసందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నేత బీ ఆసిఫ్ పాల్గొన్నారు.